సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 22 । జూలై । 2024



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావారం
కేంద్రప్రభుత్వం జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ 2020) ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతోంది.
- 8లో



ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు
జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి.
- 8లో



చీటింగ్ కేసులో ఏబీఎం అరెస్ట్
రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఏబీఎంగా పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను చీటింగ్ కేసులో వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు.
- 8లో

న్యూస్‌రీల్

కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా ధృవ



డాక్టర్ ఎస్.ధృవ

కురుపాం: మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్.ధృవ విధుల్లో చేరారు. ఈయన శ్రీకాకుళం నైరా కళాశాల నుంచి బదిలీపై వచ్చి విధుల్లో చేరగా కేవీకేలో ఇదివరలో చేసిన టీపీఎస్ పాత్రో బదిలీపై విజయనగరం వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి వెళ్లారు. నూతనంగా విధుల్లో చేరిన ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ధృవ మాట్లాడుతూ కేవీకే ద్వారా రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉంటూ మెరుగైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

'తోటపల్లి'లో తగ్గిన నీటి ప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహం

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద కాస్త పెరిగిన నీటి ప్రవాహం క్రమేపీ తగ్గుముఖం పట్టింది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం సాయంత్రం నాటికి 105 మీటర్ల లెవిల్‌కుగాను 103.95 మీటర్ల లెవిల్‌లో నీరు నిల్వ వుంది. ప్రస్తుతం నది పైభాగం నుంచి ప్రాజెక్టుకు 1333 క్యూసెక్కుల నీరు రాగా ఈ మేరకు అధికారులు రెండు గేట్లును ఎత్తివేసి 1,175 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువల ద్వారా 210 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.53 టీఎంసీలకుగాను 2.136 టీఎంసీల నీటి సామర్థ్యం వున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు వద్ద నీటి పరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

చినకుదమలో ఏనుగులు



పంట పొలాలలో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ పంట పొలాలలో ఆదివారం ఏనుగులు దర్శనమిచ్చాయి. అరటి, పామాయిల్ తోటలలో ఉంటూ పెదకుదమ, సింగనాపురం పంట పొలాలలోకి జారుకున్నాయి. ప్రస్తుతం ఉభాలు జరుగుతుండడంతో వరినారు ధ్వంసం చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖాధికారులను రైతులు కోరుతున్నారు.

ఆత్మీయ కలయిక



విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మెరకముడిదాం: మండలంలోని గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి వరకూ చదువుకున్న 1974 – 75 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 50 సంవత్సరాల తరువాత ఆత్మీయంగా కలిసారు. ఆదివారం తాము చదువుకున్న పాఠశాల గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీరంతా కలిసి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు పిసిని రామారావు, ఎస్.ఎ.వి.ఎల్.ఎన్.ఆచార్యులు, కె.బసవరాజు, టి.రామ్మూర్తి, జి.వి.ఎ.సర్వేశ్వరరావు, సిరిపురపు రాములను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు తాము చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రస్తుత హెచ్‌ఎం ఎస్.ఎస్.ఆర్.ఆచార్యులు పాల్గొన్నారు.

పన్నాగం..!



బొబ్బిలిలోని ఎస్ఈ కార్యాలయం

- బొబ్బిలి నుంచి ఇరిగేషన్ రెగ్యులర్ ఎస్ఈ కార్యాలయం తరలించేస్తారట!
- శ్రీకాకుళం తీసుకుపోవాలని మంత్రి అచ్చెన్నాయుడి కుట్రలు మళ్లీ ప్రారంభం
- గత ఐదేళ్లలో తరలింపును నిలిపేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కూటమి అధికారంలోకి రాగానే మళ్లీ అచ్చెన్న పాచికలు
- త్వరగా తరలించాలని ఇరిగేషన్ ఉద్యోగులపై ఒత్తిళ్లు
- అడ్డుకోలేక బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన బిక్కమొఖం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఇరిగేషన్ రెగ్యులర్ ఎస్ఈ కార్యాలయం బొబ్బిలిలో దశాబ్దాలుగా కొనసాగుతోంది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఈ సర్కిల్ కార్యాలయం సేవలు అందిస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఎంతో కీలకమైన దీనిపై 2014 – 19 మధ్య కాలంలోనే కుట్రలు మొదలయ్యాయి. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్రం మంజూరు చేసిన 13 కేంద్రీయ సంస్థల్లో ఏ ఒక్కటీ శ్రీకాకుళం జిల్లాకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వలేదు. దీన్ని కప్పిపుచ్చుకోవడానికి అప్పట్లోనూ మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు పన్నాగం పన్నారు. బొబ్బిలిలోనున్న ఇరిగేషన్ రెగ్యులర్ ఎస్ఈ కార్యాలయాన్ని శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడానికి హడావుడి చేశారు. అక్కడి ఇరిగేషన్ శాఖకు చెందిన పాత భవనాన్నే ముస్తాబు చేశారు. ఈ తరలింపు ప్రక్రియ మొదలయ్యేసరికి 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి. అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ తరలింపును నిలిపేసింది. టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేసరికి అచ్చెన్నాయుడు మరోసారి తన కుట్రలకు తెరలేపారు. కార్యాలయాన్ని తరలించేయాలని అధికారులపై ఒత్తిళ్లు పెంచారు. దీనికి ఎలా అడ్డుకట్ట వేయాలో స్థానిక టీడీపీ ఎమ్మెల్యే బేబీ నాయనకు తెలియక బిక్కమొఖం పెడుతున్నారు.

నాలుగు దశాబ్దాల చరిత్ర

బొబ్బిలిలోని ఇరిగేషన్ రెగ్యులర్ ఎస్ఈ కార్యాలయానికి నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. 1984 సంవత్సరంలో అప్పటి భారీ సాగునీటి పారుదల శాఖ మంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడి చొరవతో ఇది ఏర్పాటైంది. మూడు జిల్లాల్లో మంచి సేవలందిస్తూ ఉన్న ఈ కార్యాలయం పరిధిలో శ్రీకాకుళం జిల్లాలోని ప్రాజెక్టులు నాగావళి, వంశధార, రాజాం తదితర డివిజన్లు కూడా ఇక్కడి నుంచే కార్యకలాపాలు సాగించేవి. వాటితో పాటు బొబ్బిలి, పార్వతీపురం, క్యూసీ, పరిశోధనా విభాగం డివిజన్లు కూడా బొబ్బిలి సర్కిల్ కార్యాలయ కూడలిలోనే ఉన్నాయి. వాటిని నిర్వీర్యం చేసి బొబ్బిలి పరిధిలోని డివిజన్లను కూడా తరలించే ఆలోచన 2014 కన్నా ముందు కాలంలో కూడా ఉన్నా శ్రీకాకుళం నాయకుల పాచికలు పారలేదు. అప్పట్లో బొబ్బిలి, తెర్లాం, సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాల నాయకులు అడ్డుకున్నారు. దీంతో శ్రీకాకుళం నాయకులు కూడా తరలించడమనే ఆలోచన పక్కనబెట్టి మిన్నకున్నారు.

కేంద్రం నుంచి సాధించుకోలేక...

రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం 13 కేంద్రీయ విద్యా సంస్థలను విభజిత ఆంధ్రప్రదేశ్‌కు మంజూరు చేసింది. వాటిలో ఒకటైన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విజయనగరం జిల్లాకు వచ్చింది. కానీ శ్రీకాకుళం జిల్లాకు వాటిలో ఏ ఒక్కటీ సాధించుకోలేకపోయారు. తమకు ఒక సంస్థ కావాలని నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబును ఆయన మంత్రివర్గంలోనే సభ్యుడైన అచ్చెన్నాయుడు అడగలేకపోయారు. దీంతో ఆయన చేతగానితనంపై సొంత జిల్లాలో విమర్శలు ఎక్కువయ్యాయి. దీన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆయన బొబ్బిలిలోనున్న ఇరిగేషన్ రెగ్యులర్ ఎస్ఈ కార్యాలయంపై కన్నేశారు. దీని పరిధిలోని ఎనిమిది డివిజన్లలో సగానికి పైగా లాగేసి శ్రీకాకుళం జిల్లాలోని రెండు డివిజన్లను కలిపి ఒక ఎస్ఈ కార్యాలయం శ్రీకాకుళంలోనే ఏర్పాటు చేసుకోవాలని కుట్రలు మొదలెట్టారు. చేతిలో అధికారం ఉండటంతో అప్పటి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమాతో ఉన్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించుకొని, ఆ శాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి 2017 సంవత్సరంలో ఆగమేఘాలపై శ్రీకాకుళంలోని ఇరిగేషన్ శాఖ పాతభవనంలో ప్రారంభించేశారు. ఆ తరువాత బొబ్బిలి కార్యాలయానికి సంబంధించిన కొన్ని డివిజన్లు, సబ్ డివిజన్ల ఫైళ్లను తరలించాలని హుకుం జారీ చేశారు. అయితే సుమారు 40 మందికి పైగా ఉద్యోగులు ఉన్న ఈ సర్కిల్ కార్యాలయంతో పాటు ఇతర ఇరిగేషన్ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో తరలింపు ప్రక్రియ నిలిచిపోయింది. ఆ ఎన్నికల్లో అధికారం సాధించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తిగా నిలిపేసింది.

మూడింటితో మూడుతుందా?

ఎంతో చరిత్ర ఉన్న బొబ్బిలి ఇరిగేషన్ కార్యాలయం కేవలం మూడు డివిజన్లకే కుంచించుకుపోతే అది భవిష్యత్తులో దాని ఉనికికే ప్రమాదమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మూడు డివిజన్లకు ఎస్ఈ కార్యాలయం ఎందుకనే సాకుతో మరో ప్రాంతానికి తరలించేసే ప్రమాదం పొంచి ఉంటుందని చెబుతున్నారు. నెల్లూరులోని ఓ ఎస్ఈ కార్యాలయం ఇదే తరహాలో మాయమైపోయిన విషయాన్ని ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు.

అచ్చెన్న కుట్రలు మళ్లీ మొదలు

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అచ్చెన్నాయుడి కుట్రలు మళ్లీ మొదలయ్యాయి. ఇరిగేషన్ ఉద్యోగుల మెడపై కత్తి పెట్టి మరీ కార్యాలయ తరలింపు ప్రక్రియ మొదలెట్టినట్లు తెలిసింది. బొబ్బిలి సర్కిల్‌లోని 8 డివిజన్లలో మూడు మాత్రమే ఇక్కడ ఉంచి మిగతా ఐదు కూడా శ్రీకాకుళం డివిజన్‌లో విలీనం చేయాలనేది టీడీపీ నాయకుల ప్రయత్నం. అసలు పరిపాలన అనే సాకుతో ఈ విలీనమే అనివార్యమైతే డివిజన్లను సరిసమానంగా విభజించాలి. కానీ అటు అయిదు డివిజన్లు తీసేసుకొని ప్రధాన కార్యాలయమైన బొబ్బిలికి మూడు డివిజన్లు ఇవ్వాలని చూడటం అన్యాయమని ఇరిగేషన్ ఉద్యోగుల సంఘ నాయకులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

వారం రోజుల్లోనే తరలింపు



ఎస్ఈ కార్యాలయం తరలింపు ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఇప్పటికే ఆదేశాలు వచ్చాయి. ఇక్కడి డివిజన్లను శ్రీకాకుళంలో విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రకారం ఆ విలీన ప్రక్రియ సాగుతోంది. వారం రోజుల్లో తరలింపు ఉంటుంది. ఎస్ఈ, డీఎస్ఈ, ఏఈ క్యాడర్ అంతా ఈఎన్‌సీ నియమిస్తారు. ఇక్కడి నుంచి 24 మంది ఇతర సిబ్బందిని కేటాయించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– వైవీ రాజరాజేశ్వరి, ఎస్ఈ, ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం, బొబ్బిలి

నదీతీర ప్రాంతాలను సందర్శించిన కలెక్టర్



అన్నవరం సమీపంలో నాగావళి తీరం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

పాలకొండ రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నాగావళి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. దీంతో తీర ప్రాంతాల్లో ప్రజల భద్రతపై స్థానిక అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం పాలకొండ వచ్చిన ఆయన మండలంలోని అన్నవరం గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న నాగావళి నదీ తీరాన్ని సందర్శించారు. గతంలో చోటుచేసుకున్న సమస్యలపై ఆర్డీఓ వీవీ రమణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తీర ప్రాంతాల ప్రజలు, పిల్లలు నిత్యావసరాల కోసం నదిపై ఆధారపడటం సర్వసాధారణం, ఈ క్రమంలో నదిలో ప్రవహిస్తున్న, పై ప్రాజెక్టుల నుంచి విడిచిపెడుతున్న నీటి వలన అనుకోని ఉధృతితో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో ప్రజలను అప్రమత్తం చేయటం, ప్రజలు నది వద్దకు తరచూ వచ్చే ప్రాంతాల్లో జెండాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అక్కడి పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వీఆర్వోలకు, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ వరహాలు, వైద్యులు వి.కమల్‌నాథ్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై తస్మాత్..

పాలకొండ: జిల్లాలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన సందర్శించారు. వార్డుల్లో పర్యటించి ఆస్పత్రికి వస్తున్న రోగుల వివరాలు తెలుసుకున్నారు. మలేరియా, డెంగీ వంటి పరీక్షలు నిర్వహించాలని సూపరింటెండెంట్ నాగభూషణకు ఆదేశించారు. రోజు వారి వస్తున్న రోగులు వివరాలు, ఆస్పత్రిలో మందుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో జ్వరాల తీవ్రత లేదని తెలిపారు. అన్ని పీహెచ్‌సీల్లోను అవసరమైన మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆయనతో పాటు ఆర్డీఓ వెంకటరమణ, తహసీల్దార్ వరహాలు ఉన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు



ప్రమాద స్థలంలో మృతుడు సన్యాసి, చెల్లాచెదురుగా పడి ఉన్న క్షతగాత్రులు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- పది మందికి గాయాలు
- మితిమీరిన వేగం వల్లే ప్రమాదం

డెంకాడ: మితిమీరిన వేగం మృత్యువైంది. ఇద్దరు మృతి చెందగా.. పది మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని జొన్నాడ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. జొన్నాడ గ్రామం వద్ద జాతీయ రహదారిపై విజయనగరం నుంచి విశాఖ వైపు మితిమీరిన వేగంతో వచ్చిన వ్యాన్ అదే వైపు నుంచి వస్తున్న సైక్లిస్టును ఢీకొని, కాలకృత్యం కోసం వెళ్లి తన కారు వద్దకు నడిచి వస్తున్న మరో వ్యక్తిని ఢీకొట్టింది. అదుపు తప్పిన వ్యాన్ డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పది మంది గాయపడ్డారు. బొడ్డవలస గ్రామానికి చెందిన చందక లక్ష్మణరావు సైకిల్‌పై బొడ్డవలస నుంచి జొన్నాడకు వెళ్తున్నాడు. అలాగే పార్వతీపురం మండలం చినబొండపల్లి నుంచి వస్తున్న కారు జొన్నాడ వద్ద రోడ్డు పక్కన ఆపి కారులో కుటుంబసభ్యులు ఉండడంతో కాలకృత్యాల కోసం తురక ప్రవీణ్‌చంద్(34) ముందుకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుని నడుచుకుని వస్తున్నాడు. వీరిద్దరిని వ్యాన్ ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న పూసపాటిరేగ మండలంలోని గుంపాం గ్రామానికి చెందిన బాడితమాని సన్యాసి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన తురక ప్రవీణ్‌చంద్‌తో పాటు వ్యాన్‌లో ప్రయాణిస్తున్న వారు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం విజయనగరం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రవీణ్‌చంద్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. చందక లక్ష్మణకు తల, వెన్నుముకకు తీవ్ర గాయాలయ్యాయి. ఈయనతో పాటు ఒ.సాయి, వై.యోగి, ఒ.తాతారావు, జి.బంగారయ్య, ఎస్‌కే శ్రీను, వై.కామరాజు, జి. రామకృష్ణ, జి.బంగార్రాజు, జి. సూరిరమణ గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న వారిలో అక్కివరం, డి.తాళ్లవలస, దాకమర్రి, బంగార్రాజుపేట తదితర గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. ఎస్‌ఐ ఎం. కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మరణించిన బాడితమాని సన్యాసి

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి



సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తురక ప్రవీణ్‌చంద్

మరణించిన తురక ప్రవీణ్‌చంద్ సాఫ్ట్‌వే ర్ ఇంజినీర్. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలంలోని నుదురుపాడు గ్రామానికి చెందిన ప్రవీణ్‌చంద్ అత్తవారు గ్రామమైన పార్వతీపురం మండలంలోని చినబొండపల్లి నుంచి సొంత గ్రామమైన నుదురుపాడుకు కారులో వెళ్తున్నాడు. జొన్నాడ వద్ద కాలకృత్యాలకని దిగి వెళ్తుండగా ప్రమాదానికి గురై మరణించాడు. మృతుని భార్య సుష్మిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

ప్రమాద స్థలాన్ని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు, కారణాలను ఎస్‌ఐ ఎం.కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు.

టీడీపీ నేతల కక్షసాధింపు

- వైఎస్సార్‌సీపీ అభిమాని పిండిమిల్లు షాపు కూల్చివేత
- పొక్లెయిన్‌తో షాపును తొలగించిన అధికారులు



పొక్లెయిన్‌తో కూల్చివేసిన పిండిమిల్లు గది

రాజాం : టీడీపీ నేతలు ప్రత్యర్థి పార్టీకి చెందిన కార్యకర్తలను భయపెట్టడం, దాడులు చేయడం కొనసాగిస్తున్నారు. కక్ష సాధింపులో భాగంగా అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి, భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. తాజాగా గురవాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ అభిమానికి చెందిన పిండి మిల్లు షాపును కూల్చేసారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే... గురవాం గ్రామానికి చెందిన గొడే ధనుంజయ అనే వ్యక్తి వైఎస్సార్‌సీపీ అభిమాని. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. గ్రామంలో ప్రధాన రహదారి పక్కన పిండిమిల్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ మిల్లు ఉండే రేకుల షెడ్డు గదిని ఈ నెల 19న కూల్చేయగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆర్‌అండ్‌బీ అధికారులు ఆక్రమణలో ఈ షాపు ఉందని చెప్పి, లోపల పిండిమిల్లులు ఉన్నాయని కూడా చూడకుండా పొక్లెయిన్ తీసుకొచ్చి ఈ ఘటనకు పాల్పడ్డారు. అధికార పార్టీకి చెందిన నేతలే తమ పిండిమిల్లు దుకాణాన్ని కూల్చేసారని, కక్షకట్టి ఈ చర్యకు పాల్పడ్డారని బాధితుడు ధనుంజయ ఆవేదన వ్యక్తం చేశాడు.

పసుపు సాగుకు సమయమిదే..

- విత్తనశుద్ధి తప్పనిసరి
- విత్తనం ఆదా చేసుకోవడం ముఖ్యం
- ఏజెన్సీ పసుపు నాణ్యమైనదిగా గుర్తింపు
- 10 వేల ఎకరాల్లో ప్రతీ ఏటా సాగు



ఏజెన్సీలో పసుపు పంట(ఫైల్)

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో పండే పసుపునకు మంచి గుర్తింపు ఉంది. ఇక్కడ పండించే పసుపునకు ఇతర ప్రాంతాలతో పోలిస్తే నాణ్యమైనదిగా నాలుగేళ్ల క్రితం గుర్తించారు. అప్పటి నుంచి పసుపు పంటపై గిరిజనులు ప్రత్యేక దృష్టి సారించారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే పసుపు బంగారమే అవుతుందంటున్నారు. పసుపు పంట సాగు దశలో ప్రధానంగా విత్తన ఎంపిక కీలకమైంది. ఈ విత్తనాన్ని ఎన్నుకునేటప్పుడు తెగుళ్లు, చీడపీడలు లేనీ నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవాలి. ఖరీదైన పంటలను సీజన్‌లో సమయానికి వేయకపోతే దుంపపై ఆ ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సీతంపేట ఏజెన్సీలో దాదాపు 10 వేల ఎకరాల్లో సాగు జరుగుతుంది.

నాటే విధానంలో జాగ్రత్తలు పాటించాలి

పసుపు విత్తనాన్ని మూడు రకాల పద్ధతుల్లో నాటుకోవచ్చు. ఇందులో ఎత్తు మడుల పద్ధతి, సమతల పద్ధతి, బోదే పద్ధతి ఇలా మూడు రకాల పద్ధతులున్నాయి. ఎత్తుమడుల పద్ధతిలో మీటరు వెడల్పు కలిగిన కయ్యల్లో 30 సెంటీమీటర్ల వెడల్పు కలిగిన బోదెలు ఉండేలా చూసుకోవాలి. అదే విత్తన ఉంటను 15 సెంటీమీటర్ల ఎడమతో పూడ్చుకోవాలి. పసుపు పంటను ఆశ్రయించే తెగుళ్లలో దుంప కుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లు వేరు వ్యవస్థ ద్వారా వ్యాపిస్తాయి. విత్తన శుద్ధి చేయకుండా కొమ్మలను ఉంటలను పూడ్చకూడదు. పొలంలోని మురుగు నీరు బయటకు వెళ్లిపోయేలా చేసుకోవాలి. మొక్కల చుట్టూ నీరు నిల్వకుండా చేయాలి. పొటాష్ ఎరువులను సక్రమంగా వేయకపోవడం వల్ల ఇవి వ్యాప్తిస్తాయి. దీనికి మూల కారణం విత్తన శుద్ధి తప్పక చేయాలి.

అధిక ఎరువుల వాడకం చేటు

పసుపు పంటకు అధికంగా ఎరువుల వినియోగించవద్దు. దీని వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదు. దుక్కి దున్నే సమయంలో ఎకరాకు 3 బస్తాల సూపర్ పాస్ఫేట్, 200 కిలోల వేప పిండి, 25 కిలోల పొటాష్‌ను వేయాలి. ఆ తర్వాత విత్తనం పూడ్చిన 40 రోజులకు ఒక బస్తా యూరియా వేయాలి. మూడవ విడత 80 రోజులకు బస్తా యూరియా, 25 కిలోల పొటాష్, 200 కిలోల వేప పిండి వేసుకోవాలి. నాలుగో విడత 120 రోజులకు బస్తా యూరియా, 25 కిలోల పొటాష్ వేస్తే సరిపోతుంది. ఇలా శాస్త్రీయ పద్ధతిలో ఎరువులను వేయడం వల్ల ఎకరానికి రూ.8 వేల వరకు పెట్టుబడి తగ్గుతుంది.

ఎంత విత్తనం వేయాలంటే...

విత్తనం ఎకరానికి కాడి రకం సాధారణంగా ఏజెన్సీలో 1800 కిలోలు వేస్తారు. కొంత మంది రైతులు 1500 కిలోలు కూడా విత్తనంగా వేస్తారు. ఆయా పరిస్థితులను బట్టి విత్తనంగా వేసుకోవాల్సి ఉంటుంది. కొత్త పద్ధతులు ఆమలులో ఉన్నాయి. విత్తనంలో కనుపు వద్ద విరిచి చిన్న ముక్కలుగా చేసుకుని విత్తనంగా వేసుకోవచ్చు. దీంతో విత్తనం ఆదా కావడంతో పాటు రైతుకు ఖర్చు కూడా తగ్గుతుంది. పసుపు పంట సాగుకు బలమైన నేలలు శ్రేష్ఠమైనవి. నల్ల, బంక నేలల్లో సాగు చేయవచ్చు. అదే గరప, చౌడు నేలలు పనికిరావు.

జాగ్రత్తలు పాటించాలి



ఏజెన్సీలో పసుపు పంట సాగు అనువైన సమయం ఇదే. సాగుదారులు తగు జాగ్రత్తలు పాటించి పంటను పండిస్తే మంచి దిగుబడులు వస్తాయి. ఏజెన్సీ పసుపునకు ప్రత్యేకమైన గుర్తింపు ఉండడంతో మంచి లాభాలు సాగుదారులు ఆర్జించవచ్చు.

– పి.జయశ్రీ, ఉద్యానవన శాఖాధికారిణి

విత్తన శుద్ధి తప్పనిసరి

విత్తనాన్ని పొలంలో నాటే ముందు లీటరు నీటిలో మూడు గ్రాముల కార్బండిజమ్ లేదా డైథేన్ ఎం-45 ను కలిపిన ద్రావణాన్ని తయారు చేసుకోవాలి. విత్తనం ఉంటైనా, కొమ్మైనా 40 నిమిషాలు ద్రావణంలో నానబెట్టాలి. విత్తనాన్ని డ్రమ్ము నుంచి బయటకు తీసి నీడలో ఆరబెట్టాక ఆ తర్వాత విత్తనం పూడ్చాలి. శిలీంధ్ర నాశిని వల్ల వచ్చే తెగుళ్ల నివారణకు మూడు మిల్లీలీటర్ల డైమిథోయేట్ ద్రావణంలో ట్రికోడెర్మావిరిడి పొడి 3 గ్రాములు కలుపుకుని విత్తనశుద్ధి చేసుకుంటే తెగుళ్లను చాలా వరకు నివారించవచ్చు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదానం చేస్తున్న దాతలు

నెల్లిమర్ల: జరజాపుపేటలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ప్రారంభించిన గరివిడి ఎంఈఓ పాలుబోతు రామారావు మాట్లాడుతూ, యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన సాధన సభ్యులను అభినందించారు. గ్రామానికి చెందిన 15 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. సాధన ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు అవనాపు అప్పలరాజు, మద్దిల రాంబాబు, పి.ఆనంద్, డి.పూర్ణ, ఎస్.మనీష్, ఎం.శేఖర్, హరిమోహన్, సందీప్, డాక్టర్ శిరీష, కౌన్సిలర్ అప్పలనాయుడు, టెక్నీషియన్లు మురళీ, మహేష్ పాల్గొన్నారు.

మలేరియాతో గిరిజన విద్యార్థి మృతి



మలేరియాతో మృతిచెందిన గౌతమ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వామాసీ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి మండంగి గౌతమ్ (9) మలేరియాతో బాధపడుతూ ఆదివారం ఉదయం వంగర గ్రామంలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వామాసీ గ్రామానికి చెందిన గౌతమ్ చదువు నిమిత్తం వంగర గ్రామంలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబసభ్యులు తాడికొండ పీహెచ్‌సీకి శనివారం తీసుకెళ్లి వైద్య సేవలు అందించారు. గౌతమ్‌కు మలేరియా నిర్ధారణ కావడంతో వైద్యులు మందులిచ్చారు. మందులు తీసుకుని ఇంటికి వెళ్లిపోయిన గౌతమ్ ఇంట్లోనే మృతిచెందాడదని వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి, తండ్రి నాగేశ్వరరావు జీవనోపాధి నిమిత్తం వలస వెళ్లారు.

కొప్పెర్ల గురుకులం నిర్వహణపై అసంతృప్తి



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ అప్పారావు

పూసపాటిరేగ : మండలంలోని కొప్పెర్లలో గల బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మెన్ కేసలి అప్పారావు ఆదివారం సందర్శించారు. పలు సమస్యలు తిష్ట వేయడంతో నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే తరగతి గదులు, వంట గదులను పరిశీలించారు.

గంజాయితో నలుగురు నిందితుల పట్టివేత

- బైక్, స్కూటీ, నాలుగు సెల్‌ఫోన్ల సీజ్



నిందితులను విలేకరుల ముందు హాజరు పరిచిన సీఐ చంద్రశేఖర్, ఎస్సై సుదర్శన్‌లు

కొత్తవలస: బైక్‌పై అక్రమంగా గంజాయిని తరలిస్తూ నలుగురు నిందితులు పట్టుబడినట్లు సీఐ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్సై సుదర్శన్ సిబ్బందితో కలిసి కొత్తవలస జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఎస్.కోట నుంచి విశాఖ వైపు బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను తప్పించుకునే ప్రయత్నం చేశారు.దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డగించి పట్టుకుని విచారణ చేసి వారి వద్ద ఉన్న బ్యాగ్‌లో 3.42 కేజీల గంజాయిని గుర్తించారు. ఈ సందర్భంగా నిందితులను ప్రశ్నించగా అరకు నుంచి తీసుకొస్తున్నామని విశాఖపట్నంలో మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నారని వారికి అప్పజెప్పాల్సి ఉందని చెప్పారు. అయితే ఆ ఇద్దరు వ్యక్తులు కొత్తవలస మండలంలోని చింతలపాలెం గ్రామం సమీపంలో గల ఎస్‌బీఐ వద్ద స్కూటీతో ఉన్నట్లు గుర్తించి వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఒక బైక్, ఒక స్కూటీ, నాలుగు సెల్‌ఫోన్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావారం

- జాతీయ విద్యావిధానానికి నాలుగేళ్లు
- ఈ నెల 22 నుంచి 28 వరకు ప్రత్యేక వారోత్సవాలు
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర సమగ్ర శిక్ష శాఖ
- ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో విద్యాశాఖ కార్యాచరణ
- తల్లిదండ్రులు,స్థానికుల భాగస్వామ్యంతో కార్యక్రమం



విద్యా వారం విధివిధానాలపై ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న సమగ్రశిక్ష అధికారి

రామభద్రపురం/పాలకొండ రూరల్/రాజాం: కేంద్రప్రభుత్వం జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ 2020) ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతోంది ఈ సందర్భంగా వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ (విద్యావారం) కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై, దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధిలో నిబద్ధతను తెలియజేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. అప్పటివరకు ఉన్న 10+2+3 విద్యా విధానం బదులు డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ సిఫార్సుల మేరకు నూతన జాతీయ విద్యా విధానం రూపకల్పన చేశారు. ఈ ఎన్‌ఈపీ-2020 5+3+3+4 పాఠశాల విధానాన్ని ప్రవేశపెట్టారు.ఈ విధానాన్ని 2020 జూలై 29న కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.దీంతో నూతన విద్యా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో కేంద్రం ఆదేశాల మేరకు శిక్షా సప్తాహ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, స్థానికులు భాగస్వామ్యం కావాలని జిల్లా విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

జూలై 22-స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన

ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో తయారు చేసిన బోధన, అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించాల్సి ఉంటుంది.దీనికి విద్యార్థుల తల్లిందడ్రులతో పాటు స్థానిక పెద్దలను ఆహ్వానించాలి

జూలై 23-పునాది అభ్యసన కార్యక్రమం

దీనిలో భాగంగా 1వ తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు చర్చ ద్వారా అవగాహన కల్పించాల్సి ఉంది.

వారం రోజుల కార్యక్రమాలు ఇలా..

శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలతో వారం రోజుల పాటు నిర్వహించే ప్రణాళికను విద్యాశాఖ జిల్లాలోని పాఠశాలలకు పంపించింది.



బూశాయవలస కేజీబీవీ పాఠశాలలో బోధిస్తున్న టీచర్

జూలై 24-క్రీడా దినోత్సవం

వివిధ క్రీడాంశాలపై పోటీలు నిర్వహించడం, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలియజేసేలా ఈ పోటీలు ఉండాలి.

జూలై25-సాంస్కృతిక దినోత్సవం

విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు (ఫ్యాన్సీ)డ్రెస్, పాటలు, నృత్య ప్రదర్శన, నాటికలు నిర్వహించాలి.

జూలై 26-సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం

స్కిల్,డిజిటల్ ఇనిషియేటివ్ డే లో భాగంగా ప్రస్తుత ఉద్యోగావకాశాల నేపథ్యంలో అన్ని తరగతి గది అనుభవాలను మెరుగుపరచడానికి డిజిటల్ కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం. విద్యలో సాంకేతిక అభివృద్ధిని గుర్తించేలా చర్చించడం.

జూలై 27- పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు (మిషన్ లైఫ్ ఏక్టివిటీస్) పాఠశాలలో పోషణ దినోత్సవం నిర్వహణ (న్యూట్రిషన్ డే) పాఠశాలలో కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకి అంకితం కార్యక్రమం. దీనిలో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కనీసం 35 మొక్కలు తల్లీబిడ్డలతో కలిపి నాటించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

జూలై 28-సామాజిక భాగస్వామ్య దినోత్సవం

విద్యార్థుల భావోద్వేగ శ్రేయస్సు కోసం ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారాన్ని పెంపొందించడం. నైపుణ్యాభివృద్ధికి పర్యావరణ వ్యవస్థను అందించడం.అంటే పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో తిథి భోజనాలు, విద్యార్థులతో పెద్దలు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేయడం.

సమగ్రశిక్ష మార్గదర్శకాల మేరకు



రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ప్రతి పాఠశాలలో విద్యావారం తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు చేపట్టాం. సంబంధిత ఫొటోలతో కూడిన డాక్యుమెంటేషన్ నమోదు చేయాలని సూచించాం. ఈ కార్యక్రమం నిర్వహణ, అమలు తీరు, విధి విధానాలను ఉప విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్స్, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తారు.

జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

అట్టహాసంగా ఆర్‌ఆర్‌ఆర్ జ్యూవెలర్స్ షోరూం ప్రారంభం



ఆర్‌ఆర్‌ఆర్ జ్యూవెలర్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ జ్యూవెలర్స్ షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. నగరంలోని డాబాతోట ప్రాంతంలో బంగారు, వెండి ఆభరణ ప్రియులను మెమరపించే డిజైన్‌లతో ఏర్పాటు చేసిన షోరూమ్‌ను ఏపీ శాసన సభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. అనంతరం నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, మాజీ కార్పొరేటర్ కోలగట్ల వెంకటరమణి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా షోరూమ్ యజమానులు కేదారిశెట్టి సీతారామమూర్తి, రవ్వా శ్రీనివాసరావులు మాట్లాడుతూ వినియోగదారులను ఆకర్షించేలా నూతన డిజైన్‌లతో బంగారం, వెండి ఆభరణాలు తమ షోరూమ్‌లో అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు చెప్పారు. నాణ్యమైన బంగారం, వెండి, డైమండ్స్ సంబంధించిన ఆభరణాలు తక్కువ ధరలకే లభిస్తాయన్నారు. మహిళలను ఆకర్షించేలా ప్రత్యేకమైన ఆభరణాలు సరసమైన రేట్లకు వినియోదారులకు నచ్చేలా ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో మంచుకొండ అప్పలరాజు, బత్తుల బుజ్జినరసింహులు, సీఏపీఎస్‌సీ.నాగేశ్వర రావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- వెటరన్స్ విభాగంలో పోటీపడిన 100 మంది క్రీడాకారులు



అండర్-19 విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. నాలుగు రోజులుగా విజయనగరం జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో భాగంగా చివరి రోజు వెటరన్స్ విభాగంలో స్త్రీ, పురుషులకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. 35 సంవత్సరాల వయస్సు నుంచి 70 సంవత్సరాల లోపు వయస్సు గల వారికి ఈ పోటీలు నిర్వహించగా..జిల్లా నలుమూలల నుంచి 100 మంది క్రీడాకారులు తలపడ్డారు. ఉదయం ప్రారంభమైన పోటీలు రాత్రి వరకు కొనసాగగా..విజయమే లక్ష్యంగా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం కల్పించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

అండర్-19, ఉమెన్/మెన్ విభాగాల్లో విజేతలకు బహుమతులు

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో భాగంగా అండర్-19, మెన్/ఉమెన్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, కార్యదర్శి నున్న సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్ కుటుంబరావు, ఉపాధ్యక్షుడు కుసుంబచ్చన్, అసోసియేషన్ ప్రతినిధులు ఎంకేబీ శ్రీను, టి.రమేష్, సహాయ కార్యదర్శులు మల్లికార్జునరావు, టీఎల్ సుబ్బారావు, మీసాల సూరిబాబులు బహుమతులు ప్రదానం చేశారు.

అండర్ -19 బాలుర సింగిల్స్ విభాగంలో..

ఎం.రోహిత్, ఎస్.జుగునేశ్వర్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా..డబుల్స్ విభాగంలో కె.పవన్-ఎస్.దినేష్‌ల జట్టు, కె.లోకేష్-డి.ప్రవీణ్‌కుమార్‌ల జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.

అండర్-19 బాలికల సింగిల్స్ విభాగంలో..

వి.జాహ్నవి, బి.హారికలు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకోగా..డబుల్స్ విభాగంలో బి.హారిక-పి.మోనికల జట్టు, బి.కీర్తి-వి.సాయిభవన తేజల జట్టు విజేతలుగా నిలిచాయి.

పురుషుల సింగిల్స్ విభాగంలో..

ఎం.రోహిత్‌కుమార్, బి.సూర్యకిరణ్‌లు..డబుల్స్ విభాగంలో ఎస్.కె.అమన్-కె.శ్రీనుల జట్టు, బి.సూర్యకిరణ్-జి.సత్యనారాయణల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నాయి. ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో వి.జాహ్నవి, జె.శ్రేయదేవిలు..డబుల్స్ విభాగంలో వి.జాహ్నవి-బి.హారికల జట్టు, పి.మోనిక-ఎ.కాత్యాయనిల జట్లు మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకున్నాయి.

డివైడర్‌ను ఢీ కొట్టిన ఎరువుల లారీ

- రెండు గంటలు ట్రాఫిక్ జామ్



ప్రమాదానికి గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన ఎరువుల లారీ



భారీగా నిలిచిపోయిన వాహనాలు

వీరఘట్టం: వీరఘట్టం-పాలకొండ సీఎస్‌పీ రహదారిలో చిదిమి జంక్షన్ వద్ద డివైడర్‌ను ఓ ఎరువుల లారీ ఆదివారం సాయంత్రం ఢీ కొట్టింది. ప్రమాదకర మలుపు ఉన్నట్లు డ్రైవర్ గుర్తించకపోవడంతో వేగంగా వచ్చిన లారీ డివైడర్‌ను ఢీ కొట్టిందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు కానీ ఇరుకుగా ఉన్న డివైడర్ సిమెంట్ గోడ కూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా లారీ ఉండి పోవడంతో రోడ్డుకు ఇరువైపులా సుమారు రెండు గంటల సేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎస్సై షేక్ ఫకృద్దీన్, ఏఎస్సై కృష్ణంనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెండు జేసీబీలను తీసుకువచ్చి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పాడి గేదె

కురుపాం: మండలంలోని శివ్వన్నపేట గ్రామ పంటపొలాల్లో విద్యుత్ వైర్లు స్తంభానికి కట్టి ఉండడంతో స్తంభాన్ని పాడిగేదె తాకడంతో షాక్ కొట్టి ఆదివారం మృతి చెందింది. ఈ సందర్భంగా పాడి రైతు గౌడు హరి ఆవేదన వ్యక్తం చేస్తూ ఆ పాడి గేదె పైనే తమ జీవనాధారమని దాని విలువ సుమారు రూ.80 వేలు విలువ ఉంటుందని కన్నీటి పర్యంతమయ్యాడు. అధికారులు ఆదుకోవాలని కోరుతున్నాడు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం

- ధ్వంసమైన మోటార్ సైకిల్
- భయాందోళనలో గ్రామస్తులు



కాలంరాజుపేటలో విరిగిపడిపోయిన విద్యుత్ స్తంభం



విద్యుత్ స్తంభం పడి ధ్వంసమైన మోటార్ సైకిల్

తెర్లాం: వీధిలో ఉన్న విద్యుత్ స్తంభం ఒక్కసారి విరిగి పడిపోవడంతో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో ఓ వీధిలో గల విద్యుత్ స్తంభం ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆదివారం అకస్మాత్తుగా విరిగి పడిపోయింది. స్తంభానికి ఉన్న వైర్లు ఇళ్లపై పడ్డాయి. విద్యుత్ స్తంభం నేలకొరిగిన సమయంలో విద్యుత్ సరఫరా ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నిత్యం ప్రజలు సంచరించే వీధిలో విద్యుత్ స్తంభం విరిగిపోయి ఓ ఇంటిపై పడడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు హడలిపోయారు. విద్యుత్ స్తంభం విరిగిపోయి రోడ్డు మీద ఉన్న మోటార్ సైకిల్‌పై పడడంతో అది ధ్వంసమైంది. దీనిపై గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా వెంటనే వారు సరఫరా నిలిపివేసి ఎటువంటి ప్రమాదం జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. విరిగిపడిపోయిన స్తంభాన్ని వెంటనే సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

చీటింగ్ కేసులో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై హరిబాబునాయుడు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: స్థానిక మయూరి జంక్షన్ వద్ద నున్న రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కమ్ ఇన్‌చార్జ్ మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్‌ను చీటింగ్ కేసులో వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సై హరిబాబు నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రవీణ్‌కుమార్

కొంతకాలంగా ఖాతాదారుల నుంచి డబ్బులు కలెక్ట్ చేస్తూ బ్యాంక్‌కు కట్టకుండా రూ.34 లక్షలు సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సంస్థ ఉన్నతాధికారులు నోటీసులు పంపించినప్పటికీ స్పందించకపోవడంతో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. సుమారు 20 మంది నుంచి ప్రవీణ్‌కుమార్ డబ్బులు వసూలుచేసినట్లు తెలుస్తోందని పోలీసులు స్పష్టం చేశారు. బ్యాంక్ రీజనల్ మేనేజర్ సెల్వన్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై హరిబాబునాయుడు కేసు నమోదుచేసి, నిందితుడ్ని అరెస్టు చేసి ,రిమాండ్‌కు తరలించారు.

వీడని పేగుబంధం

నవమాసాలు కడుపులో మోసి ప్రపంచంలోకి తీసుకువచ్చేది తల్లి అయితే..ఈ ప్రపంచాన్ని పరిచయం చేసేది తండ్రి. గురువు, దైవం, మార్గదర్శకుడై, పిల్లల చేయిపట్టి నడిపిస్తూ..భవిష్యత్తు కోసం నిత్యం తపించే తండ్రికి పిల్లలంటే ఎనలేని ప్రేమ. పిల్లల కాలిలో ముల్లు గుచ్చుకుంటే తన గుండెల్లో గునపం దిగినంత బాధ ననుభవించే తండ్రి..విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయిన కూతురి వెంటే తాను కూడా అనంత లోకాలకు పయనమయ్యాడు. డెంకాడ మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలో జరిగిన ఈ విషాద సంఘటన వివరాలిలా ఉన్నాయి.

-డెంకాడ

- విద్యుత్ షాక్‌తో తండ్రీకూతుళ్ల మృతి



సూర్యారావు(ఫైల్)



సంధ్యారాణి(ఫైల్)

డి.తాళ్లవలస గ్రామానికి చెందిన కట్టా సూర్యారావు (45)కు భార్య శకుంతలతో పాటు కుమార్తె సంధ్యారాణి, కుమారుడు మనోజ్ ఉన్నారు. సూర్యారావు వ్యాపారం చేసి ఆర్థికంగా స్థిరపడ్డాడు. కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా ఇంటి నుంచే విధులు నిర్వహిస్తోంది. ఇంటి మేడపై ఆరవేసిన చీరను తీసేందుకు శుక్రవారం రాత్రి కుమార్తె సంధ్యారాణి(22) మేడపైకి వెళ్లింది. ఇంటి ముందు భాగంలో ఉన్న విద్యుత్‌వైరుపై చీర పడింది. చినుకులు పడుతుండడం వల్ల చీర తడిసిపోవడంతో చీర తీస్తున్న సంధ్య విద్యుత్ షాక్‌కు గురై పడిపోయింది. ఆ సమయంలో బిగ్గరగా అరవడంతో తండ్రి కట్టా సూర్యారావు(45) మేడపైకి వెళ్లి కింద పడి ఉన్న కుమార్తెను లేపేందుకు ప్రయత్నిస్తుండగా ఆయన కూడా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో తండ్రీ కూతుళ్లు ఏకకాలంలో మరణించారు. మేడమీదకు వెళ్లిన తండ్రి, సోదరి కిందికి రాకపోవడంతో కుమారుడు మనోజ్ వెళ్లి చూసి వారిద్దరూ విద్యుత్ షాక్‌కు గురయ్యారని గమనించి కాపాడే ప్రయత్నంలో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. అనంతరం ఇద్దరినీ గ్రామస్తుల సహాయంతో విజయనగరంలోని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కృష్ణమూర్తి చెప్పారు.